


"హాయ్ అనూ,

హౌ ఆర్ యు డియర్ ? ఇంకా పెళ్ళెప్పుడు చేసుకుంటావు ? ఇంకా నీ కలల రాకుమారుడు గుర్రపు స్వారీచేస్తూ ప్రత్యక్షం అవలేదా ? అన్నట్టు నీ కోసం ఓ పెళ్ళికొడుకుని పంపుతున్నాను. ఇక్కడే మా శ్రీవారితో బాటుగా పనిచేస్తున్నాడు. అతనికీ, మీకూ ఏదో బీరకాయపీచు చుట్టరికం కూడా వుందిటలే ! కుర్రాడు పొడుగ్గా, తెల్లగా, భారీగా, అందంగా ఉంటాడు. అన్నట్టు నల్లటి ఒంకులొంకుల క్రాపు

కూడా ఉంది. హిందీ సినిమా హీరోలా ఉంటాడులే ! ప్రాక్టికల్ జోక్స్ అంటే మహా ఇష్టం! మొన్నో రోజు ఏమయిందో తెలుసా ? నువు ఊరినించి వస్తున్న ట్టుగా ఓ టెలిగ్రామ్ సృష్టించి మా ప్రాణాలు తీశాడు. నీకోసం స్టేషనంతా వెతికి, వెతికి కాళ్ళు పడిపోయాక గానీ ఆ రోజు ఏప్రిల్ ఫస్టని గుర్తుకురాలేదు! ఆ తరువాత ఈ రాంబాబుగారు ఆది తన జోకేనని ఒప్పుకున్నాడు చాలా సరదా మనిషిలే ! కాస్తంత చిలిపితనం కూడా ఉందంతే ! యు విల్ లైక్ హిమ్ వెరీమచ్ డియర్.

మరి అతన్ని నువ్వెప్పుడూ చూడ లేదుగదూ ! తెల్లటి పేంటు, ఎర్రని షర్టు వేసుకొస్తాడు. షర్టు పాకెట్ మీద అందంగా ఓ అమ్మాయి డాన్సుచేస్తున్న బొమ్మ ఎంబ్రాయిడరీ చేసుంటుంది. ఈ డ్రెస్ ఏవిటి అంటావేమో కదూ ? క్రితంసారి బోనస్‌లు అందగానే ఈ మిత్రత్రయం (మా శ్రీవారు, ఈ రాంబాబు, మరో జగన్నాథం) ఒకే రకం డ్రెస్‌లు, బేండుమేళాం సెట్టు వాళ్ళలాగా కుట్టించుకున్నారు సరదాకి. రాంబాబుతో ఆ డ్రెస్ వేసుకోమని చెబుతాను. ఎందుకంటే నువు స్టేషన్లో అతన్ని తేలిగ్గా గుర్తుపట్టగలందులకు. అన్నట్టు ఆదివారం మెయిల్లో వస్తు న్నాడు. స్టేషన్‌లో రిసీవ్ చేసుకుంటావు గదూ ! అతన్ని గురించిన నీ అభిప్రాయం కోసం కాకుండా, నీ అంగీకారంకోసమే ఎదురు చూస్తున్నాను. ఇక్కడ ఒక్కదాన్ని బోర్‌కొట్టి చచ్చిపోతున్నాను. నువు కూడా వచ్చా వంటే, హాయిగా మన కాలేజ్ డేస్‌లో లాగా ఎంజాయ్ చెయ్యొచ్చు. అదీ నా ఆశ. (అన్నట్టు అతగాడి ఆస్తీ, గిస్తీ, వంశం అంకుల్‌కి బాగా నచ్చుతాయిలే ! అన్నీ విచారించే పంపిస్తున్నాను.)

మన కాలేజీ బ్యూటీ ఎలా ఉంది ? మీనా, సోనీ వాళ్ళంతా ఏం చేస్తు న్నారు. అర్జంటుగా జవాబు వ్రాస్తావు గదూ,

సీ

లల్లీ."

లలిత ఆ ఉత్తరాన్ని పోస్టులో వేసి సంతోషంగా నిట్టూర్చింది.

* * *

"ఏరా జగ్గూ, రెడీ అయ్యావా ? లేదా ?" అంటూ వచ్చాడు రాంబాబు.

"ఉండరా బాబూ నీ జోక్స్ కాదు గానీ నా ప్రాణం తీస్తున్నావు." తల దువ్వుకుంటూ విసుక్కున్నాడు. 'జగ్గూ' అనబడే జగన్నాథం.

రాంబాబు గది నాలుగు మూలల్నించి తెల్ల పేంటు, ఎర్ర షర్టులో ఉన్న జగన్నాథాన్ని పరీక్షగా చూసి, "గుడ్, బాగానే ఉన్నావు. త్వరగా పద. అర గంటమాత్రమే ఉంది ట్రైన్‌కి. అన్నట్టు నే చెప్పినవన్నీ గుర్తుపెట్టు

కున్నావా ? ఆ అమ్మాయితో అతిగా ప్రవర్తించబోయినా, మన గేమ్ బయట పెట్టినా చంపేస్తాను. మీ ఆవిడ పుట్టింటి నుంచి రాగానే మొన్న నువు రోజీతో కలిసి పిక్చర్‌కి వెళ్ళిన సంగతీ, టైపిస్టు శకుంతలతో హాస్యాలాడే విషయం, జానకితో బీచ్‌కి వెళ్ళిన సంగతి అన్నీ చెప్పేస్తాను. జాగ్రత్త !" అంటూ బెదిరించాడు.

"అందుకే నే రాను మొర్రో అన్నా అంటే విని చావ్వు. అంత నమ్మకంలేని వెధవాయివి నా ప్రాణం తియ్యటం ఎందుకు ? నే రాదే రాను. నీ ఏడు పేదో నువ్వే ఏడు. ఫో," అంటూ అలిగి తాపీగా కుర్చీలో చతికిలబడ్డాడు జగన్నాధం.

"నీ ప్రాణాలు ఎందుకు తీస్తున్నా నంటే నువ్వు కూడా అచ్చు నాలాగే హిందీ సినిమా హీరోలా అందంగా ఉంటావు కాబట్టి ! నీ క్రాపు కూడా నా క్రాపులాగా నల్లటి సముద్ర కెరటా ల్లాగా ఎగిరెగిరిపడుతూ ఉంటుంది, కాబట్టి," అంటూ నవ్వాడు రాంబాబు.

"చాల్లే వెధవ కవిత్వం. నువు హిందీ సినిమా హీరోలాగా ఉంటావ్ ! భేష్ భేష్ ! నువ్విలాటి జోక్సు వేస్తూ కూచో. ఏ ఆడపిల్లన్నా నిన్ను పెళ్ళాడితే ఒట్టు. చెవి తెగ్గోయించుకుంటాను," అంటూ ప్రామిస్‌చేశాడు జగన్నాధం.

* * *

మెయిలు స్టేషన్‌లో [illegible] ఆగింది. రాంబాబు, జగన్నాధం రైలు దిగి ప్లాటుఫారమ్‌మీద నిలబడి చుట్టూ కలియ జూశారు. ఓ యువతి ఫస్ట్‌క్లాసు కంపార్ట్ మెంట్లవైపు చూస్తూ, ఎవరికోసమో వెతుకుతున్నట్లుగా ఇటే వచ్చి చటుక్కున ఆగిపోయింది. ఎదురుగా ఒకేమాదిరిగా కనబడుతున్న రెండు తెల్ల పేంట్లు, ఎర్రషర్టని చూసి కనురెప్పలు తాటించి మరీ చూసింది, కల కాదుకదా అన్న సందేహంతో ! రాంబాబు కళ్ళ ముందు మెరుపులు మెరిసినట్లయింది. సన్నగా, పొడవుగా, నాజూగ్గా ఉన్న ఆ అమ్మాయి రెండు జడలు వేసుకుని, గులాబీ జార్జెట్ చీరలో ఎంతో, ఎంతో అందంగా ఉంది. తామరేకుల్లాటి కళ్ళు, విసనకర్రల్లాటి కనురెప్పల్ని చూసి రాంబాబు గుటకలు మింగాడు. సన్నగా సంపెంగలా ఉన్న ఆ ముక్కుని పట్టి ఊపాలన్న కోర్కెని బలవంతాన నిగ్రహించుకున్నాడు.

ఆ అమ్మాయి రెండు ఎర్ర షర్టుల వైపు మార్చి మార్చి చూసి, చిరునవ్వు నవ్వి, "నమస్తే, నేను అనూరాధని" అంది కోయిల కంఠంతో. చిరునవ్వుతో తళతళ లాడుతున్న ఆమె ఎర్రని పెదవుల్ని చూసి మైమరిచిపోతున్న రాంబాబు కాలిని జగన్నాధం పొర పాటున తొక్కినట్టుగా కసిక్కిన తొక్కాడు బూటుకాలితో. రాంబాబు ఈ లోకంలో పడ్డాడు.

"నమస్తే. నేను రాంబాబుని," అన్నాడు గొంతు పెగుల్చుకుని. ఆ అమ్మాయి చూపులు జగన్నాథంవైపు తిరిగినాయి. "నమస్తే! నా పేరు రాంబాబు," అంటూ పాఠం ఒప్పగించినట్టుగా చేతులు జోడించాడు జగన్నాథం.

అనూరాధ మరోసారి కనురెప్పల్ని టపటప లాడించి, ఇద్దరి మొహాలని మరోసారి పరీక్షగా చూసి, చిరునవ్వు నవ్వింది. ఆ కళ్ళలోని కొంటెతనం రాంబాబు గమనించకపోయినా, జగన్నాథం పసికట్టాడు ఆ అమ్మాయి కళ్ళని తా నాశించినంత విస్మయం కానరాక నిరాశపడ్డాడు రాంబాబు.

"లల్లి రాసింది మీ రొస్తున్నారని," అంది కోకిల కంఠం.

అదిరిపడ్డారు ఇద్దరూ. ఆ "మీరు" గౌరవవాచకమో, బహువచనమో తెలియక తికమకపడి, అయినా "తాము" వస్తున్నట్టుగా లలితకి తెలియదు కాబట్టి ఆ "మీ"రనేది గౌరవవాచకంగానే తల పోసి స్థిమితపడ్డారు ఇద్దరూ.

"రండి.బయట కారుంది. వెడదాం," అంటూ జగన్నాథంవైపు ఓరగా చూసి "పదండి రాంబాబుగారూ" అంది నునుసిగ్గుతో.

జగన్నాథం కాలరెత్తుకుని ఆ అమ్మాయి సరసన నడుస్తూ రాంబాబు వైపు కొంటెగా చూశాడు. రాంబాబు ఇద్దర్నీ అనుసరించాడు.

అనూరాధ ఫ్రంట్ డోర్ తీసి కూర్చోమన్నట్టుగా జగన్నాథాన్ని కళ్ళతోనే ఆహ్వానించింది. అతను ఎక్కి కూర్చోగానే తలుపు మూసి తను డ్రైవింగ్ సీటులో కూర్చుంది. రాంబాబు తనే బేక్ డోర్ తీసి కూర్చుని తలుపు మూశాడు. కారు కదిలింది.

"మీ ఇద్దరూ క్లోజ్ ఫ్రెండ్సను కుంటాను," అంది అనూరాధ అందంగా డ్రైవ్‌చేస్తూ. వాళ్ళ సమాధానానికి ఎదురు చూడకుండానే, "లల్లి వాళ్లు బావున్నారా?" అంది మళ్ళీ జగన్నాథం వైపు చూస్తూ.

"బాగానే ఉన్నారండీ," అన్నాడు జగన్నాథం.

"మీ రిద్దరూ అచ్చు ట్విన్స్‌లాగా ఉన్నారు. ఎన్. టి. రామారావు డబుల్ రోల్ వేసినట్టుగా ఉన్నారు," అంటూ కిలకిలా నవ్వింది. అది నిజమో, వ్యంగ్యమో తెలియక జగన్నాథం "హి హి," అంటూ నవ్వబోయాడు.

"థాంక్యూ," అన్నాడు రాంబాబు వెనకసీట్లోంచి. ఆ అమ్మాయి తల తిప్పి రాంబాబువైపు చూసి మళ్ళీ నవ్వింది మనోహరంగా. ప్రకృతి పులకించిపోయినట్లయింది రాంబాబు కళ్ళముందు.

"మీ లలిత బుర్ర పూర్వంలానే ఉందన్నమాట. తన ఉత్తరంలో రాంబాబుగా రొస్తున్నారని రాసిందిగానీ,

'రాంబాబుగా' గ్లొస్తున్నారని రాయ కూడదూ ! అది కాలేజీలో కూడా ఎప్పుడూ అంతేనండీ. ఒట్ఠి మొద్దు బు్ర,'' అంది అనూరాధ సుతారంగా తారుని మలుపు తిప్పుతూ.

"అవునా్లెండి. మీ స్నేహితురాలు గదా ?" నాలిక్కొరుక్కున్నాడు జగన్నాథం. అనూరాధ చూసింది. నవ్వింది. "మీరు భలే జోకింగా మాట్లాడుతారే," అంది జగన్నాథాన్ని మెచ్చుకోలుగా చూస్తూ. జగన్నాథం ఛాతీ అంగుళం పెరిగింది. రాంబాబు దవడ ఎముకలు కరకరలాడాయి.

''ఇదివర కెప్పుడయినా ఈ ఊరొచ్చారా ?" అంది అనూరాధ.

''లేదండీ. ఇదే ఫస్ట్‌టైమ్. అదీ మీ లలిత పోరు భరించలేక వచ్చాను.'' రాంబాబు వేడి దృష్టి తనమీదే ఉండటం గమనించిన జగన్నాథం పాఠం అప్పగించాడు.

"ఐసీ," అంటూ నవ్వింది ఆ అమ్మాయి పక్కకి తిరిగి. రాంబాబు కళ్ళముందు మరోసారి మెరుపులు మెరిశాయి.

అనూరాధ ఓ అందమయిన బంగళా లోపలికి కారు పోనిచ్చి దిగింది. తోటలో పనిచేస్తున్న మాలి గేట్లు మూసేశాడు.

"ఇదే మా యిల్లు''అంది జగన్నాథం వైపు తిరిగి.

జగన్నాథం ఇంటినీ, తోటని ఓ క్షణం పరిశీలనగా చూసి, "బావుంది. చాలా బావుంది. వెరీ నైస్," అంటూ మెచ్చుకున్నాడు. ఆ అమ్మాయి పెదిమలు విడకుండా నవ్వింది. రాంబాబు కళ్ళముందు మరోసారి మెరిసింది.

అనూరాధ ఇంటి మెట్లవరకు వచ్చి ఆగి, వెనకబడిన జగన్నాథాన్ని చూసి, ''అరే అక్కడే నిలబడిపోయారేం. రండి లోపలికి,'' అంటూ జగన్నాథం వచ్చేవరకు ఆగి, "మీరుకూడా రండి," అంటూ ఓ మాట రాంబాబుతో కూడా అంది.

మెట్లెక్కుతున్న అనూరాధ హైహీల్స్ స్లిప్‌అయి పడబోయింది. సరసనే ఉన్న జగన్నాథం చెయిజాపి చటుక్కున పట్టుకున్నాడు పడకుండా. ఆ అమ్మాయి జగన్నాథం భుజం గట్టిగా పట్టుకుని, తనను తాను నిలదొక్కుకుని, ''సారీ, థాంక్స్యూ,'' అంటూ మెల్లగా నవ్వి సిగ్గుగా తలొంచుకుని ముందుకు నడిచింది. ఈసారి రాంబాబు కళ్ళముందు అగ్నిగోళాలు ఫెటిల్లున పగిలినట్లయ్యాయి. దగ్గి గొంతు సవరించుకున్నాడు. ఆ సంకేతాన్ని గుర్తించిన జగన్నాథం అనూరాధకి ఆరడుగుల దూరానికి జరిగి నడిచాడు.

''కూర్చోండి,'' అంది సోఫాలు చూపిస్తూ.

''క్షమించాలి, నాన్నగారు మిమ్మల్ని కలుసుకోలేకపోయారు. అర్జంటుగా బంధువుల ఇంట్లో పెళ్ళికి వెళ్ళవలసి వచ్చింది. మీరు వస్తున్నారని నేను ఆగిపోయాను,'' అందా అమ్మాయి ఎంతో నొచ్చుకుంటూ మృదువుగా.

ముసలాయన ఎలాటి ప్రశ్నలు వేసి, ఆరాలు తీసి సతాయిస్తాడో అన్న భయంతో ఉన్న ఇద్దరూ నిశ్చింతగా ఊపిరి పీల్చుకున్నారు.

"పన్నెండు గంటలయింది. రండి, భోజనాలు చేద్దాం. ఇదో బాత్‌రూమ్ ఆ వైపు నుంది. ఇదుగో ఈ రూమ్‌లో టవల్సూ అవీ అన్నీ ఉన్నాయి. మీరు రిఫ్రెష్ అయి భోజనానికి రావచ్చు," అంటూ అనూరాధ లోపలికి తప్పుకుంది.

గెస్ట్ రూమ్‌లో రాంబాబు జగన్నాధానికి ఎదురుగా నిలబడి నవ్వాడు. జగన్నాధం నవ్వలేదు. "ఏడ్చినట్టుంది నీ జోకు. మనిద్దర్నీ చూసి ఆ అమ్మాయి తలక్రిందులై కంగారుపడి బోర్లాపడుతుందనుకున్నావు. నీకంటే గట్టి పిల్లే," అన్నాడు జగన్నాధం.

రాంబాబు చిద్విలాసంగా నవ్వాడు. "నువ్వో ఫూల్‌విరా జగ్గూ. ఏ ఆడపిల్లయినా సిగ్గు విడిచి ఏవండీ మీ ఇద్దర్లో ఎవరండీ నన్ను పెళ్ళిచూపులు చూడటానికి వచ్చింది ? అని అడుగుతోందిట్రా వెధవాయ్ ?" అన్నాడు రాంబాబు.

"ఏడిశావులే ! ఆ ముసలాయన ఇంట్లో ఉండాల్సింది. ప్రశ్నలతో చీల్చి చెండాడేవాడు. అబ్బాయిగారి బండారం బయటపడేది," అంటూ నవ్వాడు జగన్నాధం.

"జరిగేది ఎంజాయ్ చెయ్యక, జరగందాన్ని గూర్చి ఏడుస్తావేంరా నిద్రగొట్టు మొహం," అంటూ రాంబాబు బాత్‌రూమ్‌లో దూరాడు.

* * *

వంటవాడు టేబిల్‌మీద భోజనాలు సిద్ధంచేశాడు. అనూరాధ జగన్నాధానికి ఎదురుగా కూర్చుంది. పదార్థాలన్నీ కొసరి కొసరి మరీ వేయించింది.

"రాంబాబుగారూ ! మీరు ఏ బుక్స్ ఎక్కువగా చదువుతారండీ ? ఇంగ్లీషా? తెలుగా? ఫిక్షన్ నావెల్సా, సైంటిఫిక్కా ?" అందా అమ్మాయి మధ్యలో.

పరాగ్గా ఉన్న జగన్నాధం తన్ని కాదనుకుని హాయిగా భోజనం చేస్తున్నాడు. అతనికి ఇందులో థ్రిల్లేమీ కనిపించటంలేదు. ఈ రాంబాబుగాడు తన్ని బ్లాక్‌మెయిల్ చేసి తీసుకొచ్చాడుగానీ, లేకపోతే తనసలు రాకపోను. ఈ సండే హాయిగా అత్తారింటికి వెళ్లొచ్చేవాడు. జగన్నాధానికి బయటి సరదాలేం లేవు. ఇల్లూ, భార్యా ఇదే ప్రపంచం. ఇంట్లో భార్య మూతి ముడుచుకుంటే సహించలేనంతటి సాత్వికుడు. అందుకే రాంబాబు చాడీలు విని

భార్యెక్కడ మహంకాళిరూపం దాలుస్తుందో నన్న భయంచేత ఈ వెధవాయితో బయలుదేరి వచ్చి, వాడు చెప్పినట్టల్లా ఆడుతున్నాడు.

అనూరాధ కిలకిలా నవ్వటంతో ఉలిక్కిపడి తలెత్తి చూశాడు.

"ఏవిటండీ, అంత పరధ్యాన్నం?" అంటూ దీర్ఘం తీసింది అనూరాధ.

"ఏవిటన్నారు ?" అంటూ కంగారు పడుతుంటే ఆ అమ్మాయి మళ్ళీ నవ్వింది.

"భలేవారే," అంది.

"మీ ఫ్రెండ్‌ని చూస్తుంటే అబ్సెంట్ మైండెడ్ ప్రొఫెసర్‌గారు గుర్తొస్తున్నారు," అంటూ రాంబాబువైపు తిరిగి అని మళ్ళీ నవ్వింది. అంతవరకు పళ్ళు నూరుకుంటున్న రాంబాబు కళ్ళముందు మళ్ళీ మెరుపులు మెరిసినాయి, కోటి నక్షత్ర కాంతుల్తో.

"ఏ బుక్స్ ఎక్కువగా చదువుతారు ? ఇంగ్లీషా, తెలుగా?" అంది.

అసలు బుక్స్ చదివే అలవాటే లేందే ? "రెండూను," అన్నాడు జగన్నాథం.

"హిందీ పిక్చర్సా ? ఇంగ్లీషా ?" అంది మళ్ళీ.

"రెండూను ?" (ఏడాదికో పిక్చరే గదాచూసేది.)

ఆ అమ్మాయి మళ్ళీ కిల కిల నవ్వింది.

"మీరు హిందీ పిక్చర్స్‌లో ఏ హీరోని ఎక్కువ లైక్ చేస్తారు ?" అంది మళ్ళీ.

"ఎవరయినా ఒకటే లెద్దురూ," అనబోయి ఆగాడు జగన్నాథం.

జగన్నాథానికి ఈ ప్రశ్నావళి మహా చిరాగ్గా ఉంది. రాంబాబుకూడా వొళ్ళు మంటగానే ఉంది. ముఖ్యంగా ఆ అమ్మాయి జగన్నాథం అంటే చూపిస్తున్న ఇంట్రెస్టు అతనికి నచ్చటంలేదు. అతనికి కొసరి కొసరి వడ్డిస్తోంది. వాడితో జోక్ చేస్తోంది. అతని ఇంట్రెస్టు లేవిటో అడిగి తెలుసుకుంటుంది. తనతో ఏదో మర్యాదకన్నట్టుగా ఉండుండి ఓ మాట మాట్లాడుతోంది. కొంపదీసి ఈ వెధవాయిని ప్రేమించానని, వాడినే పెళ్ళాడతాను అనదు గదా ! తనో మూగబొమ్మలా, ఇంపార్టెన్స్ లేని సైడ్ హీరోలా కూచోటం మహా చిరాగ్గా ఉంది రాంబాబుకి.

అనూరాధ మళ్ళీ నవ్వింది. "అదేవిటండీ ! పెరుగు వేసుకోకుండా లేచిపోతున్నారు ?" అంది.

లేచి పోబోతున్న జగన్నాథం మళ్ళీ కంగారుగా కూలబడ్డాడు కుర్చీలో.

భోజన కార్యక్రమం పూర్తయింది. అంతా సోఫాలో కూర్చున్నారు.

"కాసేపు రెస్టుతీసుకుంటారా? నాన్నగారు నాలుగ్గంటలకల్లా వచ్చేస్తా



మన్నారు ?" అంది అనూరాధ ఫోను దగ్గరగా కూర్చుంటూ.

"అహ వద్దండీ. ఫరవాలేదులే," అంటూ నసిగాడు జగన్నాథం.

అనూరాధ సుతారంగా ఫోనందుకుని ఓ నంబర్ డయల్ చేసింది. "హల్లో, అనూ, నేను లూసీని. నీ గెస్టులు రెస్ట్ తీసుకుంటున్నారు తల్లీ. నీ నాటకంలో నా పోర్షన్ పూర్తయిపోయిందమ్మాయ్. ఇహ నువ్వొచ్చి నీ పాత్రని ధరించు," అంటూ నవ్వి ఫోన్ పెట్టేసింది. రాంబాబు, జగన్నాథం ఆ

అమ్మాయి ఏం మాట్లాడుతోందో అర్థం గాక ముఖముఖాలు చూసుకోసాగారు.

అనూరాధ ఇద్దరివైపు తిరిగి చేతులు జోడించింది "మీ రిద్దరూ నన్ను క్షమించాలి రాంబాబుగార్లూ. ఎందుకంటే అసలు అనూరాధ వచ్చేస్తోంది కాబట్టి. దాని పోరు పడలేక ఓ గంట తన పోర్షను నేను వెయ్యటానికి ఒప్పు కున్నాను. మీ అనూకి ఇంకోళ్ళమీద ఇలాటి జోక్స్ వెయ్యటం మహా సరదా లెండి," అందా అమ్మాయి చిన్నగా నవ్వుతూ.

రాంబాబు తనేమౌతున్నాడో తనకే తెలియక "అంటే మీరు...మీరు..." అనసాగాడు. ఆ అమ్మాయి మళ్ళీ అందంగా నవ్వింది. "సారీ నేను నేను గాదు. అంటే నేను అనూరాధని కాదు. నా పేరు లూసీ. నేను, లల్లీ, అనూ కలిసి చదువుకున్నాం," అంది ఆ అమ్మాయి.

రకరకాల రంగులు పులుము కుంటున్న రాంబాబు మొహంచూసి మళ్ళీ ఆ అమ్మాయి అంది. "క్షమిం చాలి. మీ ఇద్దరిలో పెళ్ళి చూపులకి వచ్చిందెవరో నాకు తెలియదు. కానీ నేను అనూతో చెప్తూనే ఉన్నాను, ఇలాంటి అల్లరి పన్లు చెయ్యకే అని. అది నా మాట లెక్కచెయ్యలేదు. పైగా ఏమందో తెలుసాండీ? "ఆ వచ్చే అతను కూడా గొప్ప ప్రాక్టికల్ జోకర్'టే అంది. ఆ మాత్రం స్పోర్టివ్‌నెస్ లేని పెళ్ళికొడుకు ఏం మొగుడే అని కూడా అంది," అంటూ ఆ అమ్మాయి క్షణ మాత్రం సిగ్గుపడింది.

రాంబాబు కళ్ళు తెరుచుకుని లూసీనే చూస్తున్నాడు జగన్నాథం ఉన్నట్టుండి నోరంతా తెరిచి పకపకా నవ్వసాగాడు. అతనికి తెరలు తెరలుగా నవ్వు పొంగు కొస్తోంది. మహా సంతోషంగా ఉంది. ఇంతవరకు అంతా రాంబాబు చేతిలో ఫూల్సయినవాళ్ళే తప్ప, అతనిమీద ఇలాటి జోకువేసిన వాళ్ళెవరూ జగన్నా థానికి కనిపించలేదు. "కంగ్రాట్యులేషన్స్ మిస్ అనూరాధా. హార్టీ కంగ్రాట్యు లేషన్స్'' అంటూ మనసులోనే ఆ అపరిచిత అనూరాధకి అభినందనలు తెలుపుకున్నాడు.

రాంబాబు బలవంతాన నవ్వుతెచ్చుకో బోతుండగా అసలు అనూరాధ గృహప్రవేశం చేసింది. టక టక లాడుతున్న బూట్ల చప్పుడికి రాంబాబు, జగన్నాథం తలలు తిప్పి చూశారు.

చామన ఛాయగా, సన్నగా ఉన్న ఓ అమ్మాయి, బెల్‌బాటమ్ పేంటు, పొట్టి షర్టు, బాబ్డ్‌హెయిర్‌తో లోపలికి వస్తూ, హేండ్‌బేగ్‌తో సహా చేతులెత్తి ఇద్దరికీ నమస్కారం చేసింది.

"అయామ్ వెరీసారీ రాంబాబు గారూ, యామ్ ఐ టూ లేట్?" అంటూ నవ్వింది. రాంబాబుని, జగన్నాథాన్ని

మార్చి మార్చి చూస్తూ. "ఇంతకీ మీలో మా లల్లీ రాసిన రాంబాబుగా రెవరు ?" అంది.

లూసీ సోఫాలోంచి లేచి వచ్చి అనూరాధ భుజంమీద చెయ్యేసి, "ఇది రాంబాబుగారు మీకు పెట్టిన క్విజ్ ప్రోగ్రామండీ అనూరాధగారూ. చెప్పు కోండి చూద్దాం? అసలు రాంబాబుగారిని కనుక్కోండి?" అంటూ నవ్వింది.

అనూరాధ నవ్వింది. నవ్వినప్పటి ఆ అమ్మాయి దంత సౌందర్యం, ముఖానికి సగంమేర పరుచుకున్న ఆ చప్పిడి ముక్కు చూసి రాంబాబు కళ్ళు మూసుకున్నాడు. జగన్నాధానికి మహా తమాషాగా ఉంది రాంబాబు అవస్థ మనసారా ఆనందిస్తున్నాడు. 'సో, ఈ అమ్మా యన్నమాట అసలయిన పెళ్ళికూతురు. పూర్ ఫెలో' అను కుంటూ రాంబాబువైపు చూశాడు. ఆ పూర్ ఫెలో ఏంచెయ్యాలో తోచక, గ్రుడ్లు మిటకరించి చూస్తున్నాడు అనూరాధవైపు.

అనూరాధ నగల నాణ్యాన్ని ఎంచు తున్నట్టుగా రాంబాబునీ, జగన్నాధాన్నీ రకరకాల కోణాల్లోంచి మార్చి మార్చి చూస్తూ, బుగ్గన వేలుంచుమని ఆలోచన అభినయిస్తూ, చింతాకులంత కళ్ళని చిట్లించి చూస్తూ, పెదిమలు బిగించి, చిట్టచివరికి రాంబాబు ఎదురుగా నిలబడి "వీరే అసలయిన రాంబాబుగారు. యామ్ ఐ కరెక్ట్ ?" అంటూ నవ్వింది. రాంబాబు చటుక్కున కళ్ళు మూసు కున్నాడు. జగన్నాధం తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు.

"అరే, ఏవిటిది ? ఫ్రెండ్స్ ఇద్దరూ ఇలా అయిపోయా రేమిటి ?" అంటూ ఆశ్చర్యంగా చూస్తూ మళ్ళీ నవ్వింది. ఆ అమ్మాయి నవ్వకుండా ఎవరయినా మూతి కుట్టేస్తే బాగుండు ననుకున్నాడు రాంబాబు.

"సో థాంక్యూ వెరీమచ్ ఫర్ యువర్ హెల్ప్ మైడియర్ ఫ్రెండ్" అంటూ లూసీ చేతిని తన చేతుల్లోకి తీసుకుని కృతజ్ఞతలు చెప్పింది అనూరాధ.

లూసీ మెరుపు మెరిసినట్లుగా నవ్వింది. "అనూ, నే నింక ఇంటికి వెడతానే. మమ్మీ ఈపాటికి చర్చినించి వచ్చేసి ఉంటుంది. ఇంకా లేట్ చేశా నంటే ఒళ్ళు వాయగొట్టేస్తుంది," అంటూ రాంబాబు, జగన్నాధాలకి ఎదురుగా వచ్చింది.

"వస్తానండీ రాంబాబుగార్లూ. థాంక్యూ ఫర్ యువర్ ప్లెజంట్ కంపెనీ," అంటూ నవ్వి సెలవు తీసుకుని, "వస్తానే అనూ" అంటూ చకచకా అడుగులేస్తూ వెళ్ళిపోయింది లూసీ.

రాంబాబుకి ఆ హాలంతా మెరుపు మెరిసి మాయమయి గాఢాంధకారం అలుముకున్నట్లు అనిపించింది.

అనూరాధ సోఫాని బర్రున లాగి రాంబాబు ఎదురుగా కూర్చుంటూ "సరిగా మమ్మీ, డాడీ మీ రొచ్చే సమయానికే మేరేజ్‌కి వెళ్ళవలసి వచ్చింది. భోజనం బాగా చేశారా ? లూసీని చూసి నేనే అనుకున్నారు గదూ ! భలే ! అది అలాగే ఉంటుందిలెండి. దాన్ని చూసి క్రిష్టియన్ అని ఎవరూ అనుకోరు. ఆ మాట మా మమ్మీయే నమ్మదు రోజూ చూస్తున్నా కూడా ! అదేం అలా మౌనంగా ఉన్నారేమిటి ?" అంది ప్రశ్నలమీద ప్రశ్నలేస్తూ.

"మీరు లిజ్ టేలర్‌ని లైక్ చేస్తారా ? ఆడ్రీ హెప్‌బర్నా ? సెక్స్ పిక్చర్స్ ఇష్టమా ? క్రైమ్ అండ్ ఫిక్షన్స్ పిక్చర్సా ?"

రాంబాబు ఆ వాగ్ధాటికి ఆశ్చర్యపోతూ ఏం జవాబు చెప్పాలో తెలియక దిక్కులు చూస్తున్నాడు.

"అరే ! మాట్లాడ రేవిటండీ ?" అంటూ సోఫామీంచి వంగి రాంబాబు చేతిమీద ఓ చరుపు చరిచింది. "ఏవిటలా చూస్తున్నారు ?" అంది గారంగా, సిగ్గుపడుతూ.

"అబ్బె ఏంలేదు, ఏంలేదు" అంటూ రాంబాబు లేచి అనూరాధకి దూరంగా ఉన్న సోఫాలో కూర్చున్నాడు.

"మీ వాలకం చూస్తే మీరు మోడరన్ గరల్స్‌ని లైక్ చెయ్యరల్లే ఉందే ? ఒక్క మాటా మాట్లాడ రేవిటండీ" అంది బాబ్డ్ హెయిర్‌ని సవరించు కుంటూ.

"అహ అదేం లేదండీ. మరి మీరేం చదువుతున్నారు" అన్నాడు రాంబాబు గొంతు పెగుల్చుకుని.

అనూరాధ నవ్వింది. రాంబాబు కళ్ళు మూసుకున్నాడు. "భలేవారండీ మీరు. మా లల్లీ చెప్పలేదా ?" అంటూ సిగ్గుతో కళ్ళు వాల్చుకుని గోళ్ళు చూసుకోసాగింది.

"జగ్గూ రైలెన్నింటికిరా?" అన్నాడు రాంబాబు తన నాటకాన్ని కూడా మర్చిపోయి.

"జగ్గూ ఎవరండీ ? ఈయన పేరు రాంబాబుగా రన్నారు గాదూ ?" అంది అనూరాధ ఆశ్చర్యంగా కళ్ళు తిప్పుతూ.

"అదే ... అదే ... మాకు మూడు గంటలకి ట్రైనుందండీ, సారీ మీ ఫాదర్ని కలుసుకోవటం పడలేదు. వచ్చాక చెప్పండి" అంటూ లేవ బోయాడు రాంబాబు.

అనూరాధ గాభరాగా లేచి నిల్చుంది రాంబాబుకి అడ్డుగా. "అప్పుడే వెళ్ళటం ఏవిటండీ ? డాడీ ఊర్కోరే ! ఎన్ని రోజులయినా సరే తను వచ్చేవరకు మిమ్మల్ని డిటెయిన్ చెయ్యమన్నారు. అసలు ఈ నైట్‌కే వచ్చేస్తారు" అంది.

రాంబాబు కుర్చీలో ఎగిరిపడ్డంత పని చేశాడు. "నో. నో. కుదరదండీ.

అంటే రేపు మండే కదండి. ఆఫీసు కదండీ. లీవు లేదండీ. మరోసారి మీ ఫాదర్ని తప్పకుండా కలుస్తామని చెప్పండి."

రాంబాబు కంగారు చూసి జగన్నాధానికి నవ్వాగటంలేదు. "పోనీ ఈ రోజుకి నువ్వుండిపోరా రాంబాబు. పాపం ఆవిడ అంతగా చెప్తున్నారు కదా" అన్నాడు జగన్నాధం నవ్వు దాచుకుంటూ. రాంబాబు 'జగ్గూని' కళ్ళతో మింగేసేట్టుగా చూసి హూంకరించాడు.

అనూరాధ ఇదేం పట్టించుకున్నట్టు లేదు. "అసలు మీరు మా యిల్లు చూశారా ? మా గార్డెన్ చూశారా ? రండి చూపిస్తాను" అంటూ జబర్దస్తీగా రాంబాబుని, జగన్నాధాన్ని ఇల్లంతా తిప్పి చూపించింది. పెద్ద పెద్ద గదులు, ఖరీదయిన ఫర్నిచరు, అందమయిన అలంకరణ, ముచ్చటయిన లైబ్రరీ అన్నీ అనూరాధ సంపదని చెప్పక చెబుతున్నాయి. అనూరాధ బెడ్ రూమ్‌లో లిల్లీ, లూసీ, అనూరాధ కలిసి దిగిన ఫొటో అందమయిన ఫ్రేములో బిగించబడి రేడియోగ్రామ్‌కి పక్కగా అమర్చారు. రాంబాబు ఆ ఫొటోలో అందంగా నవ్వుతున్న లూసీవైపు ఓసారి చూసి దృష్టి త్రిప్పుకున్నాడు.

"మా యింట్లో నే నొక్కర్తినే అవటంతో చాలా బోర్‌గా ఉంటుందండీ. అందుకే ఎక్కువ టైమ్ ఫ్రెండ్స్‌తో స్పెండ్ చేస్తూ ఉంటాను. నాకు గారాబం ఎక్కువయి, ఎవరయినా ఇంటికివస్తే మర్యాద చేయటం రాదని మమ్మీ ఎప్పుడూ కేక లేస్తుందండీ. ఏవండీ ? మీకు మర్యాద కేమీ లోపం జరగలేదు గదండీ ?" అంటూ అనూరాధ జాలిగా, అమాయకంగా చెప్తుంటే జగన్నాధం మనసు ద్రవించినట్లయింది.

"నో. నో. అలా అనుకోకండి. మా కేమీ లోపం జరగలేదు. యు ఆర్ వెరీ వెరీ నైస్ అండ్ పొలైట్" అంటూ ఊరడించాడు.

రాంబాబు గార్డెన్ అంతా చూడటం అయిన తరువాత గేటు దగ్గర్నుంచి కదలకుండా, "మరీ మేం వెడతాం. ట్రైన్ టైమవుతోంది. మీ ఆతిథ్యానికి చాలా థాంక్స్" అన్నాడు.

అనూరాధ బేలగా చూసింది. "అదేవిటండీ. కాఫీ అయినా తాగకుండా వెళ్ళిపోతారా ? మా మమ్మీకి తెలిస్తే ఊరుకోదండీ. నాదే తప్పంటుంది మిమ్మల్ని వెళ్ళనివ్వటం" అంది.

"వెరీ సారీ, వెళ్ళక తప్పదు. క్షమించాలి. మరేం అనుకోకండి" అన్నాడు దృఢంగా రాంబాబు. అనూరాధ, రాంబాబు కళ్ళలోకి చూసి నవ్వింది. రాంబాబు చటుక్కున దృష్టి మార్చాడు.

"ఓహో, మీరు భలే మొండివారల్లే ఉందే ! సరే అంతగా వెళ్ళిపోతానంటే

నేనుమాత్రం ఏం చెయ్యగలను చెప్పండి. రండి స్టేషన్‌లో డ్రాప్ చేస్తాను" అంటూ కారువైపు నడిచింది. ఫ్రంట్ డోర్ ఓపెన్ చేసి పట్టుకుంది. రాంబాబు అది చూడనట్టుగా బేక్‌న ఎక్క బోతుంటే "అరే, ఇలా రండి మీరు" అంది అనూరాధ.

తప్పనిసరిగా అనూరాధ పక్కన కూర్చున్నాడు. జగన్నాథం బేక్ సీట్‌కి జేరబడి హాయిగా కూర్చోగానే అనూరాధ కారు స్టార్ట్ చేసింది.

ఆ అమ్మాయి కారు డ్రైవ్ చేస్తున్న స్పీడు చూసి రాంబాబు గుండెలు అదిరి పోసాగాయి. "స్పీడ్ లిమిట్ దాటి పోతున్నారల్లే ఉంది" అన్నాడు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని. అనూరాధ కిల కిల నవ్వింది. రాంబాబు మొహం తిప్పుకున్నాడు. "భలే. మీరు కూడా మా లూసీకిమల్లే పిరికివారే నన్నమాట ! అదీ ఇంతే ! పాతిక దాటితేచాలు కళ్ళుమూసు కూర్చుం టుంది కారులో" అంది.

స్టేషన్ జేరగానే రాంబాబు హడా విడిగా పరిగెత్తి రెండు టిక్కెట్లు కొనుక్కొచ్చాడు. ట్రైన్ వచ్చేవరకు అనూరాధని తప్పించుకుంటూనే తిరిగాడు. తప్పనిసరిగా, మర్యాదకి జగన్నాథం ఆ అమ్మాయితోబాటుగా నించున్నాడు. ఆశ్చర్యం ! రాంబాబుతో నాన్‌స్టాప్‌గా మాట్లాడిన అనూరాధ మాటలు రానట్టే జనాన్ని చూస్తూ నిలబడింది.

ట్రైన్ దూరంగా వస్తూ కనపడింది. ప్లాట్‌ఫారమంతా కోలాహలంగా ఉంది. అనూరాధ, జగన్నాథాన్ని తప్పించు కుని రాంబాబు పక్కగా వచ్చి నిలబడింది. "మా నాన్నగారికి ఏం చెప్ప మన్నారు?" అంది మెల్లగా. ఆ మొహాన సిగ్గు దోబూచులాడుతుంటే, రాంబాబు దిక్కుతోచనట్టుగా అటూ ఇటూ చూస్తూ "నేను లెటర్ రాస్తాలెండి" అన్నాడు గొంతు పెగుల్చుకుని.

అనూరాధ కళ్లెత్తి రాంబాబుని చూసి దిగులుగా, సిగ్గుగా మరెన్నో అర్థాలు వచ్చేట్టుగా నవ్వింది. రామం అదేం గమనించనట్టుగ చటుక్కున ఎదురుగా ఆగిన కంపార్టుమెంటులోకి ఎక్కేస్తూ, "వస్తానండీ" అంటూ లోపలికి మాయమయ్యాడు.

"వెళ్ళొస్తామండీ. జాగ్రత్తగా ఇంటికి వెళ్ళండి," అంటూ జగన్నాథం కూడా సెలవు తీసుకున్నాడు. "లల్లీని అడిగా నని చెప్పండి" అంది అనూరాధ చిన్నగా నవ్వుతూ. రైలు కూతవేసి బయలుదేరింది. అనూరాధ వీడ్కోలు చెప్తూ ఊపుతున్న చెయ్యి దూర దూరంగా కనుమరుగై పోయింది.

* * *

"నీ ఉద్దేశ్యం ఏవిటసలు? ఇన్నాళ్ళు పెళ్ళి చేసుకోకుండా ఉన్నా గాబట్టి, కనబడ్డ ఎవతో ఒకత్తెని పెళ్ళాడక ఏంచేస్తాడు అనా నీ అభిప్రాయం ?"

అంటూ లలితమీద విరుచుకుపడ్డాడు రాంబాబు

"ఎవిటయ్యా బాబూ ఆ దూకుడు ? ఏం జరిగిం దసలు ? కూర్చుని చెప్పు" అంది లలిత.

రాంబాబు కూర్చుని చెప్పే మూడ్‌లో లేడు గనుక జగన్నాథం చెప్పటం మొదలుపెట్టాడు. "ఈ రాంబాబుగాడి అయిడియా ప్రకారం మేమిద్దరూ మీరు చెప్పిన డ్రెస్సులోనే వెళ్ళావండీ. ఆ అమ్మాయి స్టేషన్‌కి వచ్చింది. మా ఇద్దర్లో రాంబాబు ఎవరో గుర్తుపట్టలేక పోయింది. అయినా బయటపడకుండా ఇంటికి..."

"రాంబాబుని ఎందుకు గుర్తుపట్ట లేదు ?" అంది లలిత ఆశ్చర్యంగా.

"ఎలా గుర్తుపడుతుందండీ లలితా దేవిగారూ ? ఆవిడ్ని నేను నన్ను ఆవిడా ఎప్పుడయినా చూశాం గనకనా ?" అన్నాడు రాంబాబు కోపంగా.

"భలేవాడివే. నువు గుర్తుపట్టలేవు గానీ దాని కేంరోగం వచ్చిందయ్యా గుర్తుపట్టక ?! నా ఉత్తరంతోబాటు నీ ఫొటో గూడా పంపించా గదుటయ్యా" అంది లలిత.

రాంబాబు, జగన్నాథం నోళ్ళు తెరిచి అయోమయంగా చూశారు.

"నా ఫొటో పంపావా ? మరి ఆ అమ్మాయి..." అంటూ చటుక్కున ఆగిపోయాడు రాంబాబు.

"అసలేం జరిగిందో చెప్పరేవి టర్రా? మీరైనా చెప్పండి జగన్నాథం గారూ?" అంది లలిత.

జగన్నాథం మిగతా కథని - లూసీ అన్న అమ్మాయి అనూరాధలాగ వచ్చి తమని రిసీవ్ చేసుకోవటం, తాము ఆ పిల్లే అనూరాధ అనుకోవటం, సుష్టుగా భోజనాలు చేశాక ఆ అమ్మాయి గుట్టు కాస్తా బయటపెట్టి, అసలు అనూరాధని అప్పగించి ఇంటికి చక్కాపోవడం, అసలు అనూరాధని చూసి రాంబాబు దడుసుకున్నవైనం, ఆ పిల్ల వేష భాషలు అన్నీ వివరంగా చెప్పాడు జగన్నాథం.

"పాపం అనూరాధగారు మాత్రం మనవాడంటే మహా మోజుపడిపోయిం దండీ లలితగారూ. మరొక్కరోజు ఉండమంటే ఉండమని ఎంత బతిమి లాడిందనీ రాంబాబుని" అంటూ జగన్నాథం నవ్వుతూ మండుతున్న నిప్పులో మరికాస్త ఉప్పేశాడు.

రాంబాబు చిటపట లాడిపోయాడు. "చాల్లే నోరు మూసుకో. అసలా అమ్మా యేనా రంభ, ఊర్వశి అంటూ పొగి డావు ?! ఆ చప్పిడి ముక్కు, పార పళ్ళు, చీకి కళ్ళు, ఆ అవతారం" అంటూ లలితమీద మండిపడ్డాడు.

లలిత గడ్డంమీద వేలేసుకుని ఆశ్చర్యపోయింది. "అనూకి చప్పిడి ముక్కా ? పార పళ్ళా ? చీకి కళ్ళా ? బాబ్డ్ హెయిరా ? మీకేం మతిపోలేదు

గదా ? అసలు ఎవరనుకుని ఎవర్ని చూసొచ్చావ్ ?" అంది లలిత గదమాయిస్తూ.

అందరి మతులూ పోతున్నాయేమో ననుకున్న సమయంలో పోస్ట్ అంటూ ఓ కవరు గిరాటు కొట్టిపోయాడు పోస్ట్‌మాన్.

దస్తూరి చూసి లలిత కవరు విప్పి చకచకా ఉత్తరం చదివేసి, కడుపు పట్టుకుని పగలబడి నవ్వసాగింది.

జగన్నాథం నోరప్పగించి చూస్తుంటే, రాంబాబు లలిత చేతిలోని ఉత్తరాన్ని లాక్కుని చదివాడు గడగడా.

"హాయ్ లల్లీ, ఏమంటున్నారు మీ ప్రాక్టికల్ జోకర్ ? మా జోక్ ఆయనకి ఎలా ఉందో చెప్పారా లల్లీ. ? నిజంగా నువ్విక్కడ ఉండి చూడా ల్సిందే ఫార్సు. నవ్వలేక పొట్ట చెక్కలయ్యేదనుకో. మీ హేండ్‌సమ్ హీరోని రిసీవ్ చేసుకోవటానికి నేనే స్టేషన్‌కి వెళ్ళాను. పాపం హీరోగారు నేను తన్ని గుర్తుపట్టలే ననుకున్నాడు గాబోలు ! నన్ను తమాషా చెయ్యటానికి తనలాటి వేషం వేసుకున్న మరో ఫ్రెండుని లాక్కొచ్చాడు. అయినా నువు పంపిన ఫొటోద్వారా మీ హీరోగారిని గుర్తు పట్టేశాలే ! తెలియనట్టే ఇద్దర్నీ ఇంటికి తీసుకెళ్ళాను. సుష్ఠుగా తినిపించాక నేను నేను కాదని, లూసీయే అనూరాధ అని చెప్పి దాన్ని నా సీట్లో కూచోబెట్టి నేను తప్పుకున్నాను. నిజంగా లూసీ నటన నువు చూసి ఉండాల్సిందే లల్లీ ! అదసలే రూపానికేగాక, బుద్ధులగ్గూడా కోతేగదా ! పాపం మీ రాంబాబుగారిని హడలగొట్టి పారేసిందనుకో. కాఫీ కూడా తాక్కుండా మీ హీరోగారు రైలెక్కి పారిపోయారని చెప్పి లూసీ ఒకటే నవ్వటం. అన్నట్టు ఈ మధ్యనే లూసీ, డేవిడ్ ప్రేమించి పెళ్ళాడారు. అది ఇక్కడే జాబ్ చేస్తోంది.

మరి మీ హీరోగారి విషయంలో నా అభిప్రాయంగాక అంగీకారం రాయమన్నావు గదా ! ఇంతకీ మీ రాంబాబు గారి అభిప్రాయ మేమిటో తెలుసు కున్నావా ? నేను ఆ నకిలీ రాంబాబు గారితో శ్రద్ధగా మాట్లాడుతుంటే పాపం మీ రాంబాబు గారెలా కుళ్ళుకుపోయా రనుకున్నావ్ ? ! కోపగించుకోవద్దని చెప్పవే పాపం. సీ

అనూ."

రాంబాబు చేతుల్లోంచి జారిపోయిన ఉత్తరాన్ని జగన్నాథం అందుకుని చదివాడు. చదివాక నవ్వాడు. నవ్వాక అన్నాడు, "అవునూ ! లూసీల్ని ప్రేమించే డేవిడ్లు కూడా ఉన్నారన్న మాట !" అని.

"ఎందుకుండరూ ? తా వలచింది రంభ, తాను మునిగింది గంగ" అన్నారు కదండీ పెద్దలు" అంది లలిత నవ్వాపుకుంటూ.